

కలుపు కష్టాలు
జిల్లాలో విస్తారమైన వర్షాలకు పొలాల్లో విపరీతమైన కలుపు పెరిగింది. వరిలో కలుపు తొలగించేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 9లో▸



డిగ్రీ విద్యార్థులకు వర్క్‌షాప్
కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.3 /24.6
ఆకాశం దాదాపు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడ ఉరుములతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్



అరవింద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి అరవింద్ బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ మహేశ్వర్ తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణలో పీడీ తిరుపతి, అధ్యాపకులతో కలిసి విద్యార్థిని అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 13, 14 తేదీల్లో జనగాంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో చాప్లే అరవింద్ ఉత్తమ ప్రతిభ చూపి బంగారు పతకం కైవసం చేసుకున్నాడని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

మరో రెండు 'సహకార' పాలకవర్గాలు కొనసాగింపు

ఆసిఫాబాద్ అర్బన్: జిల్లాలో రెండు సహకార సంఘాల పాలకవర్గాలను కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా సహకార అధికారి రాథోడ్ బిక్కు తెలిపారు. జిల్లాలో 12 సహకార సంఘాలు ఉండగా మొదటి విడతలో ఏడు సంఘాల పాలకవర్గాలను ఇప్పటికే పొడిగించారు. తాజాగా ఆసిఫాబాద్, వాంకిడి సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలాన్ని ఆరు నెలలపాటు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మిగిలిన రెబ్బెన, తిర్యాణి, బెజ్జూర్ సహకార సంఘాలకు ఇన్‌చార్జీలను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. తిర్యాణికి మునీశ్వరీ, రెబ్బెన, బెజ్జూర్ సహకార సంఘాలకు శామ్యూల్ మాథ్యూస్ ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తారని తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో ఏర్పాట్లు పరిశీలన



స్టేషన్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, రైల్వే అధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఈ నెల 18 నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్ ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో హాల్టింగ్ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, రైల్వే అధికారులు ఆరా తీశారు. స్టేషన్‌లోని ప్లాట్ ఫాం 1, 2, 3లతోపాటు కార్యక్రమానికి రానున్న నాయకులు, అధికారులకు ఏర్పాటు చేసిన సభాస్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే సీజనల్ వ్యాధుల కట్టడి

ఆసిఫాబాద్: క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటేనే సీజనల్ వ్యాధుల కట్టడి సాధ్యమవుతుందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం సీజనల్ వ్యాధుల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు, సిబ్బంది ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి ప్రతిరోజూ 400కు పైగా రోగులు వస్తుంటారని, అందరికీ మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. చిన్న కారణాలతో ఇతర ప్రాంతాలకు రోగులను పంపించడం సరికాదని, వారికి ఇక్కడే వైద్యం అందించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో సీతారాం, డీసీహెచ్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

20న స్పాట్ అడ్మిషన్లు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా సమన్వయ అధికారి యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. వీటీజీ సెట్‌కు హాజరైన విద్యార్థులు హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, నివాసం, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో ఈ నెల 20న జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో హాజరు కావాలని సూచించారు. సాంఘిక సంక్షేమ బాలుర ఆసిఫాబాద్, సిర్పూర్(టి) బాలుర, రెబ్బెన బాలికల, సిర్పూర్(టి) బాలికల, కాగజ్‌నగర్ బాలికల గురుకులాల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని, మెరిట్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఎస్సీ విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

నిరంకుశంపై తిరుగుబాటు

- నిజాం సైన్యంపై ఆసిఫాబాద్ వాసుల పోరాటం
- కదిలివచ్చిన సామాన్య ప్రజానీకం..
- మహారాష్ట్రలో సాయుధ శిక్షణ..
- ప్రత్యక్ష, పరోక్ష పోరులో పాలుపంచుకున్న వైనం

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటంలో ఆసిఫాబాద్‌కు చెందిన ఎంతోమంది పాలుపంచుకున్నారు. పోరుబాట పట్టి ప్రాణాలు పణంగా పెట్టి పోరాటం సాగించారు. రజాకార్ల అరాచకాలతో సహనం కోల్పోయిన సామాన్యులు సైతం స్వచ్ఛందంగా తుపాకీ పట్టారు. ఇండియన్ యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానాన్ని కలపడంలో భాగంగా సాగిన పోరాటంలో సరిహద్దులోని ఆసిఫాబాద్ ప్రాంతం కీలకంగా వ్యవహరించింది. వేలాది మంది కాంగ్రెస్ అతివాద నాయకుల నేతృత్వంలో పోరాటంలోకి దిగారు. ఆసిఫాబాద్ పోరాట యోధులపై ప్రత్యేక కథనం.
– ఆసిఫాబాద్



చీల శంకర్ (ఫైల్)



చీల విఠల్ (ఫైల్)



దండనాయకుల గోపాల్ కిషన్‌రావు(ఫైల్)



ఏకబిల్వం నాగేంద్రయ్య(ఫైల్)



చిలుకూరి సీతారాం(ఫైల్)



తాటిపెల్లి తిరుపతి(ఫైల్)



బోనగిరి వెంకటేశం(ఫైల్)

వ్యూహకర్త.. బాపూజీ



కొండా లక్ష్మణ్ బాపూజీ (ఫైల్)

నిజాం నిరంకుశ పాలనపై పోరాడిన వారిలో ఆసిఫాబాద్‌కు చెందిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కీలకంగా వ్యవహరించారు. తెలంగాణ తొలి, మలి ఉద్యమాల్లో సైతం ఆయన పాలుపంచుకున్నారు. హైదరాబాద్ సంస్థానంలోని ప్రస్తుత మహారాష్ట్రలోని రాజూరాలో ఆయన జన్మించారు. 1938లో తొలిసారి అరెస్టయ్యారు. 1941– 42లో ఖద్దరు, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1947లో కింగ్‌కోఠి నుంచి బయటకు వచ్చిన నిజాం నవాబుపై బాంబులు విసిరిన ఘటనలో బాపూజీ నిందితుడిగా ఉన్నారు. మహారాష్ట్రలోని చాందా మిలటరీ క్యాంపులో పంజాబ్ రెజిమెంట్ మేజర్ పీస్ గుహన్ వీరికి శిక్షణ అందించారు. అక్కడ క్యాంపు ఇన్‌చార్జి గోపాల్‌శాస్త్రి బేకర్, బల్లార్షా క్యాంప్ ఇన్‌చార్జిగా కేవీ కేశవులు ఉన్నారు. కొండా లక్ష్మణ్ ఈ క్యాంపులకు వ్యూహకర్తగా వ్యవహరించారు. హైదరాబాద్ సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో కలపాలనే ఉద్యమం కారణంగా ఆయన 13సార్లు అరెస్టు అయ్యారు.

మహారాష్ట్రలో సాయుధ శిక్షణ

ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన బోనగిరి వెంకటేశం, తాటిపెల్లి తిరుపతి, చీల శంకర్, చీల విఠల్, ఏకబిల్వం నాగేంద్రయ్య, ఖాడ్రే శంకర్, రాంసింగ్, రేవయ్య, తాటిపల్లి తిరుపతి, ఏకబిల్వం శంకరయ్య, చందావార్ విఠల్, చిలుకూరి సీతారాం, జగన్నాథ్‌తో పాటు అనేక మంది యోధులు అజ్ఞాతంలోకి వెళ్లి మహారాష్ట్రలోని చాందా సాయుధ శిక్షణ శిబిరంలో ఏడాది పాటు శిక్షణ పొందారు. వీరికి ఆసిఫాబాద్‌కు చెందిన రాంచందర్ రావు పైకాజీ, సుబ్బాబురావు, దండనాయకుల గోపాల్ కిషన్ రావు, వామన్‌రావు వైరాగరే, ప్రభాకర్‌రావు మసాదే సహకరించారు. నిజాంకు వ్యతిరేకంగా ప్రచారం చేసినందుకు 1948 ఏప్రిల్ 21న వామన్ రావును జైలులో పెట్టారు. న్యాయవాది పైకాజీ సమరయోధులకు మానసిక ధైర్యం, ఆర్థిక సహకారాన్ని అందించడంతో ఆయనపై హత్యాయత్నం కూడా జరిగింది. చాందా క్యాంపులో శిక్షణ పొందుతున్న సమయంలోనే ఆసిఫాబాద్‌కు చెందిన నాయకులు విరూర్ రైల్వేస్టేషన్ విధ్వంసం ఘటనలో పాలుపంచుకున్నారు. ఈ ఘటనలో బోనగిరి వెంకటేశం కాలికి గ్రేనేడ్ తగలగా, ఆయన ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.


ఇండియన్ ఆర్మీతో కలిసి..

హైదరాబాద్ సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేసేందుకు అప్పటి కేంద్ర హోంశాఖ మంత్రి సర్దార్ వల్లబాయ్‌పటేల్ 1948 సెప్టెంబర్ 13న పోలీస్ యాక్షన్ ప్రకటించారు. మహారాష్ట్ర నుంచి సైనిక బలగాలు పది యుద్ధ ట్యాంకులు, పది ట్రక్కులు, 20 తానే గార్డ్‌లు, వందలాది మంది సైనికులతో ఆసిఫాబాద్ మీదుగా హైదరాబాద్ వైపు కదిలాయి. సెప్టెంబర్ 13న చంద్రాపూర్, బల్లార్షా, దాభా(ఉప క్యాంపు) సిరొంచ క్యాంపుల నుంచి సాయుధ సమరయోధులు భారత సైన్యం బాటలో రజాకార్లపై చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలోనే భారత సైన్యం హైదరాబాద్ సంస్థానంలోకి ప్రవేశించకుండా రాజురా సమీపంలోని రైల్వే వంతెనకు రజాకార్లు బాంబులు అమర్చారు. అయితే 14న రాత్రి 11 గంటలకు రైల్వే వంతెన పేల్చివేత ప్రయత్నాలను సమరయోధులు గుర్తించారు. అదేరాత్రి 12 గంటలకు ఈ విషయాన్ని కొరియర్ వ్యవస్థ ద్వారా మిలటరీకి తెలియజేశారు. 2 గంటల ప్రాంతంలో ఇండియన్ ఆర్మీ దాడి చేసి రజాకార్లను మట్టుబెట్టింది. బాంబులను సైతం తొలగించారు. తెల్లవారుజాము 3 గంటలకు విరూర్ రైల్వే స్టేషన్‌పై ఆసిఫాబాద్‌కు చెందిన బోనగిరి వెంకటేశం, మరో ఆరుగురు దాడి చేశారు. ఈ ఘటనలో కొందరికి బుల్లెట్ గాయాలయ్యాయి. పోలీసులు కొందరు చనిపోగా, మరికొందరు లొంగిపోయారు. 15న తెల్లవారుజామున 4 గంటలకు దాబా మీదుగా వచ్చిన మరో మిలటరీ క్యాంపు, సాయుధ పోరాట వీరులు పెన్‌గంగ సరిహద్దులోని లోనవెల్లి నాకాపై దాడి చేశారు. అదేరోజు రాత్రి 10 గంటలకు ఆసిఫాబాద్ సమీపంలోని బుజల్‌ఘాట్ వంతెనను రజాకార్లు పేల్చివేశారు. కానీ మరుసటి రోజు స్థానికులు ఇక్కడ తాత్కాలిక మార్గం ఏర్పాటు చేశారు. 16న అర్ధరాత్రి దాటిన తర్వాత సిరొంచ నుంచి వచ్చిన సైన్యం, సమరయోధులు బెజ్జూర్ ఔట్‌పోస్టుపై దాడి చేసి స్వాధీనపరుచుకున్నారు. తెల్లవారుజామున దహెగాం సమీపంలో పెసరకుంట వద్ద రజాకార్లపై దాడి చేశారు. ఈ ఘటనలో 19 మంది మృతి చెందారు. అనంతరం బీబ్రా పోలీస్ స్టేషన్‌ను సైతం స్వాధీనం చేసుకున్నారు. ఇదే రోజు స్వాతంత్య్ర సమరయోధులను ఆసిఫాబాద్ జిల్లా జైలులో పెట్టారు. 17న లొంగిపోతున్నట్లు నిజాం రాజు ప్రకటించడంతోపాటు జైలులోని వారు ఇతర ఖైదీలతో కలిసి బయటకు వచ్చారు. పోరాటంలో పాలుపంచుకున్న జిల్లాకు చెందిన అనేక మంది నాయకులను ప్రభుత్వం స్వాతంత్య్ర సమర యోధులుగా ప్రకటించింది.



1948 సాయుధ పోరాటంలో పాలుపంచుకున్న ఆసిఫాబాద్ వాసులు(ఫైల్)

నిజాంపై గోండు బెబ్బులి పోరు



కుమురం భీం

జల్, జంగల్, జమీన్ నినాదంతో గిరిజన పోరాట యోధుడు కుమురంభీం నిజాం ప్రభుత్వంపై భీకర పోరు సాగించారు. అడవిపై హక్కులు, సామాజిక న్యాయం అందించాలని కెరమెరి మండలంలోని బాబేఝరి కేంద్రంగా గిరిజనులతో అడవి నరికి 12 పోరు గ్రామాలను ఏర్పాటు చేశారు. మేకల కోసం చెట్టు కొమ్మను కొట్టిన తన స్నేహితుడు పైకు చేతి వేళ్లను జంగ్లాత్ సేరేదార్ నరికించడం, ఆదివాసీ మహిళలపై అసభ్యంగా ప్రవర్తించడం వంటి ఘటనలు కుమురం భీంను తీవ్రంగా కలచివేశాయి. దట్టమైన అడవుల్లోని జోడేఘాట్ కేంద్రంగా దీంతో సైన్యంతో గెరిల్లా పోరాటం సాగించాడు. నిజాం నిరంకుశత్వం, అటవీశాఖ అధికారుల అరాచకాలపై ప్రజలను చైతన్య పరిచాడు. ప్రభుత్వం విధించే పన్నులు కట్టవద్దని పిలుపునిచ్చి అప్పటి ప్రభుత్వంపై తిరుగుబాటు ప్రకటించాడు. ఆయన మరణంతో అలజడి చెలరేగడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు ప్రారంభించి ఆదివాసీల కోసం అనేక చట్టాలు రూపొందించింది.

'ప్రజాపాలన' వేడుకలకు ఏర్పాట్లు

- ముఖ్య అతిథిగా శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో బుధవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ముఖ్య అతిథిగా తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ హాజరు కానున్నారు. ఉదయం 9.55 గంటలకు ముఖ్య అతిథి బండ ప్రకాశ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించనున్నారు. 10 గంటలకు జాతీయ పతాకావిష్కరణ, జాతీయ గీతాలాపన, తెలంగాణ అధికారిక పాట, ముఖ్య అతిథి ప్రసంగం 10.10 గంటలకు ఉంటుందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. వేడుకలపై మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చే వారికి తాగునీరు, అల్పాహారం, నీడ, ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పనులు, నిరంతర విద్యుత్ సరఫరా చేయడంతోపాటు వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అంబులెన్స్, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వాహనాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

డిప్యూటీ చైర్మన్ పర్యటన ఇలా..

ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ బుధవారం జిల్లాలో పర్యటిస్తారని ఆయన ప్రైవేట్ సెక్రెటరీ రోహిత్ కుమార్ తెలిపారు. ఉదయం 9.25 గంటలకు గోలేటి సింగరేణి గెస్ట్ హౌస్ నుంచి బయలుదేరి 9.55 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుంటారు. అక్కడ ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.10 గంటలకు జోడేఘాట్ వెళ్లి తిరిగి గోలేటి గెస్ట్‌హౌస్‌కు చేరుకోనున్నారు.

'చరిత్రను వక్రీకరిస్తున్న పాలకులు'

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాలకులు వక్రీకరిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణి శంకర్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట సీపీఐ జెండాను జిల్లా కార్యదర్శి బద్రి సాయి ఆవిష్కరించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ సాయుధ పోరాటానికి సంబంధించి సర్వహక్కులు సీపీఐ పార్టీకే దక్కుతాయన్నారు. నాటి పోరాటంలో దొడ్డి కొమురయ్యతోపాటు 4,500 మంది అమరులయ్యారని, తెలంగాణలోని గ్రామాల్లో నేటికీ నెత్తుటి ఆనవాళ్లు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని, అమరుల జీవిత చరిత్రను తక్షణమే పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బద్రి సత్యనారాయణ, ఆత్మకూరి చిరంజీవి, ఉపేందర్, పిడుగు శంకర్, నర్సయ్య, రాజశేఖర్, శ్రీకాంత్, మహేశ్, వెంకటేశ్, అజయ్, వికాస్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ సాధించిన ఉమ్మడి జిల్లా బాలుర జట్టు ఇదే ఉత్సాహంతో జాతీయ స్థాయిలో పోటీల్లోనూ రాణించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 14న జనగామ జిల్లాలో జరిగిన అండర్– 14 బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలుర జట్టు చాంపియన్‌షిప్ సాధించగా, మంగళవారం అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు జీఎంను కలిశారు. ఈ సందర్భంగా వారిని జీఎం అభినందించారు. క్రీడాకారులకు సహకరించేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతి, ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.నారాయణరెడ్డి, షార్ప్‌స్టార్ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీ శ్రీనివాస్, డీజీఎం ఉజ్వల్‌కుమార్ పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న జీఎం

భీం వర్ధంతి ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- అధికారులు, కమిటీ సభ్యులతో సమీక్ష

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలం జోడేఘాట్‌లో అక్టోబర్ 7న గిరిజన పోరాటయోధుడు కుమురం భీం 85వ వర్ధంతి ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. జోడేఘాట్‌లో ఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఉత్సవ కమిటీ సభ్యులతో మంగళవారం వర్ధంతి, దర్బార్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ హట్టి నుంచి జోడేఘాట్ వరకు బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. దర్బార్‌లో దరఖాస్తులు సమర్పించేలా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గిరిజనులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆదివాసీ గూడేల్లో నివాస గృహాలు, తాగునీటి కల్పన పనులు వెంటనే పూర్తిచేయాలన్నారు. పార్కింగ్ కోసం వినియోగించే వ్యవసాయ భూమికి పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జోడేఘాట్ విద్యార్థులు, స్థానిక ప్రజల అవసరాల కోసం పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా సభాస్థలి, పార్కింగ్, దర్బార్ స్థలాలను పరిశీలించారు. అంతకు ముందు భీం విగ్రహానికి నివాళులర్పించి, సమాధిపై పూలు చల్లారు. సమావేశంలో ఏఎస్పీ చిత్తరంజన్, డీడీ రమాదేవి, ఈఈ తానాజీ, అదనపు డీఎంహెచ్‌వో మనోహర్, పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్, జీసీసీ మేనేజర్ తారాచంద్, భీం మనుమడు కుమురం సోనేరావు, కమిటీ సభ్యులు పెందోర్ రాజేశ్వర్, మడావి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.



భీం సమాధిపై పూలు చల్లుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, పీవో ఖుష్బూ గుప్తా, తదితరులు

మహిళలకు ఆరోగ్య పరీక్షలు

- నేటి నుంచి వచ్చేనెల 2 వరకు వైద్యశిబిరాలు
- ప్రత్యేక నిపుణులతో పరీక్షలు, మందులు పంపిణీ
- సద్వినియోగం చేసుకోవాలని వైద్యారోగ్యశాఖ సూచన

ఆసిఫాబాద్‌అర్బన్: వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. స్వాస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పేరిట బుధవారం నుంచి గాంధీ జయంతి అక్టోబర్ 2 వరకు మహిళలకు వైద్య పరీక్షలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. సెలవు దినాలను మినహాయించి మిగిలిన రోజుల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తూ పరీక్షలు చేయనున్నారు. వ్యాధి నిర్ధారణ అయితే సిబ్బంది అక్కడికక్కడే మందులు సైతం అందించనున్నారు.

52 వైద్యశిబిరాలు

జిల్లాలోని 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి, సామాజిక ఆస్పత్రుల్లో మహిళల కోసం ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించనున్నారు. మారుమూల గ్రామాల ప్రజలకు దూరభారం అయితే సబ్ సెంటర్లలోనూ వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తారు. అక్టోబర్ 2నాటికి రోజుకు నాలుగు చొప్పున మొత్తం 52 శిబిరాలను నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మహిళలకు గైనకాలజీ, కంటి, చెవి, ముక్కు, గొంతు, చర్మ, మానసిక, దంత సమస్యలపై మహిళా వైద్య నిపుణులతో పరీక్షలు చేస్తారు.

ఆరోగ్యంపై దృష్టి సారించేలా..

ప్రస్తుతం మహిళలు ఇంటి పనులు, వృత్తి పనులతో బిజీగా ఉంటూ ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా జిల్లాలో గర్భిణులను రక్తహీనత వెంటాడుతోంది. వ్యాధి ముదిరిన తర్వాత ఆస్పత్రుల్లో చేర్పించినా ప్రయోజనం ఉండడం లేదు. నారీమణుల్లో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం స్వాస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌కు శ్రీకారం చుట్టింది. జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచి అక్టోబర్ 2 వరకు వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, కంటి, దంత, చర్మ, చెవి, ముక్కు, గొంతు, ప్రసూతి, డెర్మటాలజీ, సైక్రియాట్రిస్ట్ వైద్య నిపుణులు సేవలందిస్తారు. బీపీ, మధుమేహం, క్యాన్సర్, టీబీ, హిమోగ్లోబిన్ లోపం పరీక్షలతోపాటు గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక పరీక్షలు చేస్తారు. అవసరమైన మందులు అక్కడికక్కడే అందిస్తారు. రక్తహీనత బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారంపై అవగాహన కల్పిస్తారు. క్షయ నిర్ధారణ అయితే వారికి కార్డులు అందిస్తారు. జిల్లాలో 15 మండలాల పరిధిలో అనేక ఏజెన్సీ గ్రామాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో సికిల్ ఏనిమియా పరీక్షలు నిర్వహించి నిర్ధారణ జరిగితే వైద్యం అందిస్తారు. జిల్లాలో ఇప్పటివరకు బీపీ 9వేలకు పైగా, షుగర్ 3వేలకు పైగా, క్యాన్సర్ బారిన పడిన మహిళలు సుమారు 50 మంది వరకు ఉంటారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. వైద్యశిబిరాలను జిల్లాలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచిస్తున్నారు.



మహిళను పరీక్షిస్తున్న వైద్యురాలు(ఫైల్)

ఏర్పాట్లు చేశాం



కేంద్ర, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు జిల్లాలో స్వాస్థ్ నారీ.. సశక్త్ పరివార్ అభియన్‌లో భాగంగా మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. మహిళలు వైద్యశిబిరాలకు వచ్చేలా ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు అవగాహన కల్పించాలి.
– సీతారాం, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

పిచ్చికుక్క దాడిలో ఎనిమిది మందికి గాయాలు

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్, సాగర్ కాలనీలో మంగళవారం ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసి ఏడుగురు మహిళలతో పాటు ఓ చిన్నారిని గాయపరిచింది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధులు, మహిళలపై దాడి చేయడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే వారిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. పిచ్చి కుక్క దాడికి పాల్పడగా కాలనీవాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ధన్నూర్(బీ)లో చిన్నారికి..

బోథ్: మండలంలోని ధన్నూర్ (బీ) గ్రామంలో ఇంటి వద్ద ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడు అద్వైత్ మంగళవారం కుక్కల దాడిలో గాయపడ్డాడు. కుటుంబీకులు వెంటనే అతడిని స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనతో కాలనీలో భయాందోళనలు నెలకొన్నాయి. వీధి కుక్కల సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చంపుతామని బెదిరించిన ఐదుగురిపై కేసు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన ఐదుగురిపై మంగళవారం హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దంపేటకు చెందిన ఓ మహిళకు మంత్రాలు వస్తాయనే కోపంతో అదే గ్రామానికి చెందిన బండపల్లి గురువయ్య, బండపల్లి దేవేంద్ర, తాడూరి గురువయ్య, తాడూరి శంకరవ్వ, బండపల్లి రాజయ్య ఆమె ఇంటికి వెళ్లి అసభ్యపదజాలంతో దూషించారు. చంపుతామని కూడా బెదిరించారు. ఈ మేరకు బాధితురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు ఐదుగురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మరోసారి ఎలాంటి గొడవకు పాల్పడకుండా బండపల్లి రాజయ్య, తాడూరి గురువయ్యను తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే ఎదుట బైండోవర్ చేశారు. రూ.లక్ష జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష పడేలా ఏడాది కాల వ్యవధికి బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

హత్య కేసు నిందితుడికి జీవిత ఖైదు

నిర్మల్ రూరల్: ఓ హత్య కేసు నిందితుడికి జిల్లా జడ్జి శ్రీవాణి జీవిత ఖైదు విధించినట్లు ఎస్పీ జానకీ షర్మిల మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. 2020లో జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ శివాడే మారుతి అదే కాలనీకి చెందిన ఓ వివాహిత రెండో భర్త కామ్లే కిశోర్‌తో గొడవపడ్డాడు. కిశోర్ ముఖంపై పెద్ద బండరాయితో కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం విచారణ సందర్భంగా సాక్ష్యాలు, ఆధారాలను పరిశీలించిన జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శ్రీవాణి నిందితుడికి జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్పీ వివరించారు. నిందితుడికి శిక్ష పడేందుకు కృషిచేసిన పీపీ వినోద్‌రావు, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్, ఎస్సై కృష్ణకుమార్, రమేశ్, సిబ్బంది డబ్లుసింగ్, ప్రభాకర్, సురేశ్‌ను ఎస్పీ అభినందించారు.

గంజాయి సాగు చేసిన వ్యక్తికి పదేళ్లు..

ఆసిఫాబాద్‌అర్బన్: గంజాయి సాగు చేస్తున్న కేసులో ఒకరికి పదేళ్ల జైలు, రూ.20వేల జరిమానా విధించినట్లు డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు ఆసిఫాబాద్ ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ తీర్పునిచ్చినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ మంగళవారం తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు అప్పటి వాంకిడి ఎస్సై రమేశ్ తన సిబ్బందితో 2022 జనవరి 17న మేరకు వాంకిడి మండలం సోనాపూర్ గ్రామ శివారులో పత్తి చేనులో తనిఖీలు నిర్వహించారు. కినక జంగు తన చేనులో గంజాయి సాగు చేయగా గుర్తించి అతడిపై కేసు నమోదు చేశారు. వాంకిడి సీఐ సత్యనారాయణ, ఎస్సై మహేందర్ సాక్షులను కోర్టులో హాజరుపర్చగా పీపీ జగన్‌మోహన్‌రావ్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ విచారణలో నేరం రుజువు కాగా జంగుకు పదేళ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ.20వే జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పీపీతోపాటు ప్రస్తుత ఏఎస్పీ చిత్తరంజన్, వాంకిడి సీఐ, ఎస్సై, కోర్టు లైజనింగ్ అధికారి రామ్‌సింగ్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

అతిథి అధ్యాపకుల అరిగోస



నిర్మల్ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- మూడు నెలలుగా అందని జీతాలు
- నెలనెలా చెల్లించాలని వేడుకోలు

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అతిథి అధ్యాపకులకు గౌరవవేతనం అందక దిక్కుతోచని పరిస్థితుల్లో జీవనం గడుపుతున్నారు. ఈ విద్యాసంవత్సరంలో తరగతులు ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా పారితోషికం చెల్లించలేదు. నిర్మల్ జిల్లా ముథోల్, భైంసా, నిర్మల్ ప్రాంతాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలున్నాయి. భైంసాలో 13మంది, నిర్మల్‌లో 12మంది, ముథోల్‌లో 12మంది, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో 12 మంది, చెన్నూర్‌లో ఆరుగురు, మంచిర్యాలలో 7, లక్సెట్టిపేటలో 10 మంది అతిథి అధ్యాపకులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి ప్రతీనెల గరిష్ఠంగా 72 పీరియడ్లకు గాను రూ.28,080 గౌరవ వేతనంగా చెల్లిస్తున్నారు. గెస్ట్ లెక్చరర్లుగా రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు. వేతనాలు మాత్రం సరైన సమయానికి రాక కుటుంబ పోషణ అస్తవ్యస్తంగా మారిందని వారు ఆవేదన చెందుతున్నారు. మూడు నెలలకోసారి బడ్జెట్ విడుదలై బిల్లులు చేసి వీరికి చెల్లించేసరికి మరింత జాప్యం జరుగుతోంది.

సమస్యలతో సతమతం

అతిథి అధ్యాపకులకు పీరియడ్ల వారీగా నెలసరి వేతనం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతవిద్యాశాఖ నిర్ణయించగా దసరా, సంక్రాంతి తదితర సెలవుల నేపథ్యంలో మాత్రం ఆ వేతనంలోంచి కోత విధిస్తున్నారు. పరీక్షల సమయంలోనూ వేతనం చేతికందదు. 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి అనేకమంది పేద బడుగు బలహీన విద్యార్థులకు డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టడంలో అతిథి అధ్యాపకులదే కీలక పాత్ర. సమాన పనికి సమాన వేతనం పేరిట ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో చేర్చి రూ.50వేలు, కన్సాలిడేటెడ్ పేగా ఉద్యోగ భద్రత కల్పించేందుకు హామీ ఇచ్చింది. ప్రస్తుతం హామీ నెరవేర్చడంలో జాప్యం జరుగుతోందని, తమ సేవలను గుర్తించడంలో అధికారులు తాత్సారం చేస్తున్నట్లు వారు వాపోతున్నారు.

పండుగలోపు రాకుంటే పస్తులే..



జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న 37మందికి ఇప్పటివరకు మూడునెలలుగా వేతనాలు రావడం లేదు. కనీసం దసరా పండుగలోపు బకాయిలు ఖాతాల్లో జమ చేయాలి. ఇప్పటికే చేతిలో చిల్లిగవ్వ లేక సతమతమవుతున్నాం. రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా ప్రభుత్వాలు మా గోడు పట్టించుకోవడం లేదు.

– సురేందర్, డిగ్రీ అతిథి అధ్యాపకుల సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు


కలెక్టర్ సంతకం ఫోర్జరీ

- ముగ్గురు నిందితులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో రెడ్‌క్రాస్ సొసైటీకి కలెక్టర్ కేటాయించిన స్థలాన్ని నకిలీ పత్రాలు సృష్టించి కాజేసేందుకు యత్నించిన ముగ్గురు నిందితులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన గడుగు గంగన్న, ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కల్‌గూడకు చెందిన వసీమ్ కోకర్ ఆ ప్లాట్‌కు సంబంధించి 2015లో పనిచేసిన కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలు సృష్టించారు. అనంతరం ఆదిలాబాద్ మున్సిపాలిటీలో ఆ ప్లాట్‌కు పన్ను కూడా చెల్లించారు. ఈ పత్రాలతో వారు డాక్యుమెంట్ రైటర్ ఈర్ల రాజు సహాయంతో వసీమ్ కోకర్ పేరిట పట్టాను చేయించారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ వివరించారు. ప్రాథమిక విచారణలో నిందితులు ఫోర్జరీ సంతకాలు సృష్టించినట్లు నిర్ధారణ కావడంతో వారి నుంచి కంప్యూటర్‌తో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా నివాస, ఇతర స్థలాలకు సంబంధించి నకిలీ పత్రాలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

కడ్తాల్ పెద్ద చెరువుకు గండి

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామ సమీపంలోగల పెద్ద చెరువు కట్ట మంగళవారం తెగిపోయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో చెరువు తూము వద్ద కట్ట బలహీనపడింది. దీనికి తోడు సోమవారం రాత్రి కురిసిన వర్షానికి తూము వద్ద బుంగ ఏర్పడి కట్ట పూర్తిగా తెగిపోయింది. దీంతో చెరువులోని నీరంతా దిగువనున్న పంట పొలాల్లోకి వెళ్తోంది. గ్రామస్తులు వెంటనే నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. గత ప్రభుత్వంలో రూ.78లక్షలతో మిషన్ కాకతీయ కింద చెరువు పూడికతీత పనులు చేపట్టినప్పటికీ కట్టను పటిష్ఠం చేయలేదని ఆరోపించారు. భారీగా కురిసిన వర్షానికి చెరువు పూర్తిగా నిండి తెగిపోయి రైతులకు నష్టం చేకూర్చిందని పేర్కొన్నారు. నీటిపారుదలశాఖ ఈఈ అనిల్, ఏఈ మధుకర్‌ను సంప్రదించగా, సోమవారం రాత్రి కురిసిన వర్షంతో భారీగా చెరువులోకి నీరు వస్తోందని, వరద ఉధృతి తగ్గిన వెంటనే గండిని పూడ్చివేస్తామని తెలిపారు. అంతకుముందు తహసీల్దార్ మల్లేశ్‌రెడ్డి గండిని పరిశీలించారు.


గండిపడి వృథాగా పోతున్న చెరువు నీళ్లు

108లో ప్రసవం

ఇంద్రవెల్లి: ఓ నిండు గర్భిని 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. ఈ ఘటన సోమవారం రాత్రి మండలంలోని ముత్నూర్ సమీపంలో జరిగింది. నార్నూర్ 108 అంబులెన్స్ ఈఎంటీ ప్రదీప్‌కుమార్, పైలెట్ రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. సిర్పూర్ (యూ) మండలంలోని పుల్లార గ్రామానికి చెందిన పర్చకి మారుబాయికి సోమవారం రాత్రి పురుటినొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు ఆమెను ఉట్నూర్ సీహెచ్‌సీకి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు రిమ్స్‌కు రెఫర్ చేశారు. 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు ఆమెను తరలిస్తుండగా ముత్నూర్ సమీపంలో పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అంబులెన్స్‌ను రోడ్డు పక్కనే ఆపి ఈఎంటీ ప్రదీప్ పురుడుపోశారు. మారుబాయి మూడో కాన్పులో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. వారిని రిమ్స్‌కు తరలించారు. 108 సిబ్బందిని పలువురు అభినందించారు.


మారుబాయి, శిశువుతో 108 సిబ్బంది

గంజాయి విక్రేతల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సీసీఐ గోదాం వద్ద ముగ్గురు గంజాయి నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం పట్టణంలోని రాంనగర్‌కు చెందిన బత్తుల నగేశ్, మహాలక్ష్మివాడకు చెందిన వటోరి వినోద్, ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ షబ్బీర్ గోదాం వద్ద గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు వారిని పట్టుకున్నారు. కాగా, వీరు వడ్డెర కాలనీకి చెందిన బంటయ్య, గాంధీనగర్‌కు చెందిన రోహిత్ నుంచి గంజాయి కొనుగోలు చేశారు. నిందితుల వద్ద 8 గ్రాముల గంజాయి లభించినట్లు సీఐ వివరించారు.

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు మంగళవారం గంజాయి విక్రేతలను అరెస్ట్ చేశారు. స్థానిక సీఐ ప్రమోద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో సిబ్బందితో కలిసి మఫ్టీలో నిఘా పెట్టారు. అదే ప్రాంతంలో అనుమానాస్పదంగా గోదావరిఖనికి చెందిన ఓ మైనర్ బాలుడితో కలిసి బిజిగిరి వినయ్ తిరుగుతున్నాడు. వీరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా కిలో 100 గ్రాముల గంజాయి లభించింది. తదుపరి విచారించగా మహారాష్ట్రలో తక్కువ ధరకు గంజాయి కొని మంచిర్యాల, గోదావరిఖని ప్రాంతాల్లో యువతకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పటిక, బెల్లం పట్టివేత

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్‌లో అత్తె గంగాధర్ కిరాణా దుకాణంలో అక్రమంగా నిల్వచేసిన 240 కిలోల పటిక, 60 కిలోల నల్లబెల్లం పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉమ్మడి జిల్లా సీఐ గంగారెడ్డి తెలిపారు. షాపు నిర్వాహకుడు గంగాధర్‌ను అదుపులోకి తీసుకుని, పటిక బెల్లం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. తదుపరి చర్యల నిమిత్తం లక్సెట్టిపేట ఎక్సైజ్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి నిందితుడిని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బైండోవర్ చేసినట్లు లక్సెట్టిపేట ఎక్సైజ్ ఎస్సై మౌనిక వెల్లడించారు.

అనారోగ్యంతో బాలింత మృతి

సిరికొండ: నవమోసాలు మోసి పండంటి బిడ్డకు జన్మనిచ్చిన ఆ తల్లి నాలుగు రోజులకే మృత్యువాత పడింది. వివరాలు.. మండలంలోని భీంపూర్ గ్రామానికి చెందిన తోడసం భీంరావు భార్య హెత్మబాయి (21) ఈ నెల 12న ఇంద్రవెల్లి మండలంలోని ప్రాథమిక ప్రభుత్వ ఆస్పత్రిలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. వైద్యులు ఆమెను ఈ నెల 14న డిశ్చార్జి చేయగా ఇంద్రవెల్లి మండలంలోని మారుతిగూడలోని తన తల్లి ఇంటికి వచ్చిన తర్వాత తలనొప్పి వస్తుందని హెత్మబాయి తెలిపింది. దీంతో వెంటనే ఆమెను ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఈ నెల 15న మృతి చెందింది. నాలుగురోజులకే తల్లిని కోల్పోయిన చిన్నారిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పురుగుల మందు తాగి ఒకరు మృతి


దీనాజీ (ఫైల్)

లోకేశ్వరం: మండలంలోని హద్గాం గ్రామానికి చెందిన జోగుదాండే దీనాజీ (54) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. దీనాజీ నిత్యం ఏ పనీ చేయకుండా మద్యం తాగి జులాయిగా తిరుగుతుండేవాడు. సోమవారం మద్యం సేవించేందుకు భార్య శోభాబాయిని డబ్బులు అడగగా ఆమె నిరాకరించింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన దీనాజీ వెంటనే గ్రామ సమీపంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్ట్ కెనాల్ వద్దకు వెళ్లి గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే భైంసాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదేరోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు భోజారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య


పిట్టల లక్ష్మి (ఫైల్)

మందమర్రిరూరల్: కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తితో వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మందమర్రిలో చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దీపక్‌నగర్‌కు చెందిన పిట్టల లక్ష్మి (65) కొంతకాలంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతోంది. మంగళవారం తెల్లవారుజామున సుమారు 3గంటలకు మృతురాలి భర్తకు మెలకువ రావడంతో లక్ష్మి మంచం వద్దకు వెళ్లి చూడగా ఆమె కనిపించలేదు. సమీపంలో వెతకగా బావిలో మృతదేహం కనిపించింది. ఆమె కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడ్డీ వ్యాపారి వేధింపులకు ఒకరు ఆత్మహత్య

ఇంద్రవెల్లి: వడ్డీ వ్యాపారి వేధింపులకు ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలకేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. బుద్దనగర్‌కు చెందిన దహికాంబ్లే రాము (40) మండల కేంద్రంలో బైక్ మెకానిక్‌గా పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 10న సాయంత్రం పని ముగించుకున్న తర్వాత పురుగుల మందు తాగి ఇంటికి వెళ్లాడు. ఇంటి వద్ద వాంతులు చేసుకుంటుండగా అతడి భార్య సంఘమిత్ర గమనించింది. ఏమైందని అడిగితే తాను వ్యాపారం నిమిత్తం జవహర్‌లాల్ అనే వడ్డీ వ్యాపారి వద్ద రూ.20 వేలు అప్పు తీసుకున్నానని తెలిపాడు. ప్రతీ వారం రూ.1,500 చొప్పున చెల్లిస్తున్నానని, ఆర్థిక ఇబ్బందులతో మూడు వారాలుగా చెల్లించకపోవడంతో వడ్డీ వ్యాపారి ఇష్టారీతిన తిట్టడంతో అవమానంతో పురుగుల మందు తాగినట్లు చెప్పాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృత్యుడికి భార్యతోపాటు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడున్నారు. కాగా, ఘటనపై మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసినా వడ్డీ వ్యాపారిపై కేసు నమోదు కాలేదు. దీంతో ఎస్పీ అఖిల్ మహాజన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్సై సాయన్నకు సంప్రదించగా.. ఈ నెల 10న ఫిర్యాదు అందినమాట వాస్తవమేనని, మంగళవారం ఉదయమే కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఆర్టీసీ కార్మికులపై పనిభారం తగ్గించాలి


జెండా ఆవిష్కరిస్తున్న యూనియన్ సభ్యులు

ఆదిలాబాద్: ఆర్టీసీ కార్మికులపై పనిభారం తగ్గించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ అధ్యక్షుడు సర్పే భీమ్‌రావు కోరారు. ఆదిలాబాద్ డిపో ఎదుట మంగళవారం ఫెడరేషన్ 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కిలోమీటర్ల పెంపు, ఓటీలు తగ్గించడం, రన్నింగ్ టైం కుదించడంతో కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని తెలిపారు. వీటన్నింటినీ ఎదుర్కోవాలంటే ఫెడరేషన్‌ను మరింత బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల సాధనకు పోరాడటానికి ఎప్పుడు సిద్ధంగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ కార్యదర్శి మిట్టపల్లి భీంరావు, డిపో కార్యదర్శి అశన్న, వెంకటేశ్, రవి, సాయన్న, రాజేందర్, ప్రకాశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆదర్శ’ విద్యార్థికి రాష్ట్ర స్థాయిలో స్వర్ణం


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీఈటీలు

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి జక్కుల అశ్విన్ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ మంగళవారం తెలిపారు. జనగామ జిల్లా కూనూర్‌లో నిర్వహించిన అండర్–14 విభాగంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తరఫున పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థి, పీఈటీ శ్రీనివాస్‌ను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

మోడల్ స్కూల్‌కు చెందిన ఇంటర్ ఫస్టియర్ బీ సాయినాథ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఖలీల్ తెలిపారు. ఈనెల 15న పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో బెల్లంపల్లి సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో నిర్వహించిన అండర్–19 విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరిని ప్రిన్సిపాల్, పీఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచాలి


పీడీలను సన్మానిస్తున్న పెటా సంఘం ప్రతినిధులు

ఆదిలాబాద్: జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీలకు ఎంపికైన జిల్లాకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)లు ప్రతిభ కనబరచాలని ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ (పెటా) జిల్లా అధ్యక్షుడు పార్థసారథి సూచించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పీడీలు జీ.నాందేవ్ (జెడ్పీఎస్ఎస్, సుంకిడి), జాదవ్ రవీందర్ (జెడ్పీఎస్ఎస్, భరంపూర్)ను జిల్లా కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల హైదరాబాద్ వేదికగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో నాందేవ్ 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం సాధించగా, జాదవ్ రవీందర్ లాన్ టెన్నిస్ క్రీడలో ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. ఇరువురు నవంబర్‌లో న్యూఢిల్లీ వేదికగా నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. పెటా జిల్లా ప్రధాన కార్యదర్శి సాయికుమార్, ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రామేశ్వర్, కోశాధికారి శ్రీనివాస్, గోపాల్, రాము, రవీందర్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

‘పటేల్’తోనే తెలంగాణ ప్రజలకు విముక్తి


ఇచ్చోడలో మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

ఇచ్చోడ: సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతోనే తెలంగాణ ప్రజలకు సెప్టెంబర్ 17న విముక్తి కలిగిందని ఎంపీ గోడం నగేశ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణ ప్రజలు బ్రిటీష్ పాలనలోనే ఉన్నారని గుర్తు చేశారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విముక్తి దినంగా ఘనంగా జరుపుకోవాలని కోరారు. దేశంలో జీఎస్టీ బిల్లును కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చిందని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కౌన్సిల్ ఏర్పాటు చేసి స్లాబ్‌లు తగ్గించడం ద్వారా అనేక రకాల వస్తువులపై ధరలు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ద్వారా ఎంతో మందికి ప్రయోజనం కలిగిందని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం, జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ్ అమ్టె, కౌన్సిల్ సభ్యుడు తాటిపెల్లి రాజు, అసెంబ్లీ కన్వీనర్ కదంబారావు, మండలాధ్యక్షుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుకు సాయం చేయబోయి..


రాజారాం (ఫైల్)

బెల్లంపల్లిరూరల్: మూగజీవికి సాయం చేయడానికి వెళ్లి ఓ వ్యక్తి ప్రాణాలు పోగొట్టుకున్న ఘటన బెల్లంపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు, తాళ్లగురిజాల ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బుధాకుర్దు గ్రామానికి చెందిన జంగపల్లి రాజారాం (69) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం ఓ పని నిమిత్తం ఇంటి నుంచి రవీంద్రనగర్‌కు కాలినడకన బయలుదేరాడు. రోడ్డుపై నడుస్తున్న క్రమంలో ఓ ఎదు ముక్కు తాడు విడిపోయి ఇబ్బంది పడడాన్ని గమనించాడు. ఎద్దు దగ్గరికి వెళ్లి ముక్కుతాడు సరి చేస్తుండగా అది రాజారాంను పొట్ట భాగంలో కొమ్ములతో పొడిచింది. అంతటితో ఆగకుండా కొమ్ములతో అతడిని లేపి విసిరి వేసింది. దీంతో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి బలంగా కొట్టుకున్న రాజా రాంకు తీవ్ర గాయాలై రక్తస్రావం కాగా కిందపడిపోయాడు. స్థానికులు వెంటనే అతడిని బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రాజారాం మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎదుకు సాయం చేయబోయి రాజారాం ప్రాణాలు పోగొట్టుకోగా గ్రామంలో విషాదం నెలకొంది. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేత్రదానం

జంగపల్లి రాజారాం నేత్రాలను సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేకరించి ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు పంపించారు. కార్యక్రమంలో వైద్యుడు సతీశ్, జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీశ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లిలో డెంగీ కేసు నమోదు


పారిశుధ్య పనులు చేయిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని ప్రబుద్ధనగర్‌లో ఓ బాలుడికి డెంగీ పాజిటివ్ వచ్చింది. వివరాలు.. మండల కేంద్రంలోని ప్రబుద్ధనగర్‌కు చెందిన గాయక్‌వాడ్ సచిన్, సంజీవన దంపతుల మూడేళ్ల కుమారుడు సంఘర్ష్‌కు వారం రోజులుగా జ్వరం వస్తోంది. కుటుంబ సభ్యులు మండలకేంద్రంలోని పలు ఆస్పత్రుల్లో వైద్యం అందించినా తగ్గలేదు. రెండురోజుల క్రితం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి డెంగీగా నిర్ధారించారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం విషయం తెలుసుకున్న ఎంపీడీవో జీవన్‌రెడ్డి, గ్రామపంచాయతీ ఈవో సంజీవ్‌రావు, అధికారులు ప్రబుద్ధనగర్‌ను సందర్శించారు. గాయక్‌వాడ్ సచిన్ ఇంటి పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు


శిశుగృహలో చిన్నారులతో ప్రేమలత అగర్వాల్

ఆదిలాబాద్‌టౌన్/ఇచ్చోడ/నేరడిగొండ: పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠినచర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ప్రేమలత అగర్వాల్ హెచ్చరించారు. మంగళవారం నేరడిగొండలోని కేజీబీవీ, ఇచ్చోడలోని జెడ్పీఎస్ఎస్, అడిగామ(కే)లోని అంగన్‌వాడీ కేంద్రం, జిల్లాకేంద్రంలోని శిశుగృహ, సఖీ కేంద్రం, బంగారిగూడలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు, బోధన తీరు తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. శిశుగృహలో ముగ్గురు మగ పిల్లలు, నలుగురు ఆడపిల్లలున్నారని, ఇందులో ఇద్దరు పిల్లలు మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారని తెలిపారు. వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. శిశుగృహ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సఖీ కేంద్రంలో కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి, సభ్యుడు సమీరుల్లా ఖాన్, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు ఉదయశ్రీ, ఉష్కం తిరుపతి, ఐసీపీఎస్ అధికారి రాజేంద్రప్రసాద్, ఆదిలాబాద్ రూరల్ సీడీపీవో నర్సమ్మ, సాధికారత కోఆర్డినేటర్ యశోద, ఎస్‌సీపీసీఆర్ కన్సల్టెంట్ మధురవాణి, శిశుగృహ మేనేజర్ విజయలక్ష్మి, కౌన్సిలర్ స్వప్న, స్వామి తదితరులున్నారు.

సీనియర్ ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక


ఎంపికైన జిల్లా జట్టు

రామకృష్ణాపూర్: పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను పట్టణ ఎస్సై రాజశేఖర్ ప్రారంభించారు. ప్రతిభ కనబర్చినవారిని జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి తెలిపారు.